నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I హైదరాబాద్, మంగళవారం 7 మే 2024 SIDDIPET

# నేడు పురిటిగడ్డకు గులాబీ దళపతి



- నేడు మెదక్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సుయాత్ర
- రాందాస్ చౌరస్తా వద్ద రోడ్‌షో
- భారీగా తరలిరానున్న ప్రజలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన బీఆర్ఎస్ శ్రేణులు

మెదక్, మే 6(నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మెదక్‌కు బీఆర్ఎస్ అధినేత, గులాబీ దళపతి కేసీఆర్ రానున్నారు. కేసీఆర్ రాక కోసం ప్రజలంతా ఎదురు చూస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కేసీఆర్ బస్సు యాత్ర, రోడ్ షోలో ప్రజలు, యువకులు, రైతులు భారీగా తరలివస్తున్నారు. జనవాహినితో రోడ్లన్నీ జనమయం కావడంతో పాటు కేసీఆర్ ప్రసంగాన్ని ఆసక్తిగా వినేందుకు పెద్దసంఖ్యలో తరలిరానున్నారు. మెతుకుసీమ ప్రజలంతా కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు. రోడ్‌షో, బస్సుయాత్రలో భాగంగా రాత్రి 8.30గంటలకు జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తా వద్ద కేసీఆర్ ప్రసంగిస్తారు. ఆయన వెంట బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, నాయకులు రానున్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. పెద్దసంఖ్యలో జనాన్ని సమీకరించేందుకు కసరత్తు చేస్తున్నారు.



ములుగులో రోడ్‌షోకు భారీగా తరలివచ్చిన ప్రజానీకం

# కాంగ్రెస్‌వి అలవికాని హామీలు

- హామీలు విస్మరించిన కాంగ్రెస్
- బీఆర్ఎస్‌ను ఆదరించాలి
- నాలుగు నెలల కాంగ్రెస్ పాలనలో రైతులు ఆగం
- తెలంగాణ సాధకుడు కేసీఆర్‌ను రేవంత్ తిట్టడం సరికాదు
- నిస్వార్థ నాయకుడు వెంకట్రామిరెడ్డి
- ములుగు రోడ్‌షోలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



ములుగులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు, పక్కన వెంకట్రామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి

ములుగు, మే 6: అలవికాని హామీలతో గద్దెనెక్కి, వాగ్దానాలు విస్మరించిన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ములుగులో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా నిర్వహించిన రోడ్‌షోకు ఆయన హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందిందన్నారు. ప్రతి గడపకూ కేసీఆర్ సంక్షేమ ఫలాలు అందించారని గుర్తుచేశారు. ప్రాణాలకు తెగించి రాదనుకున్న తెలంగాణను సాధించి పెట్టిన కేసీఆర్‌ను నోటికి వచ్చినట్టుగా తిడుతున్న రేవంత్‌కు ఓట్లతోనే గుణపాఠం చెప్పాలన్నారు. అసెంబ్లీలో కాంగ్రెస్ మెడలోంచి హామీల అమలుకు పోరాడుతామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకొస్తే 6 గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి హామీలు అమలు చేయకపోవడమేకాక ఉన్న పథకాలను ఊడగొట్టి ప్రజలకు నష్టం కలిగిస్తున్నదని హరీశ్‌రావు పేర్కొన్నారు. కారుగుర్తుకు ఓటు వేసి వెంకట్రామిరెడ్డిని ఆశీర్వదించి గెలిపిస్తే కష్టసుఖాల్లో అందరికీ అండగా ఉంటాడన్నారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో లేని విద్యుత్, నీటి సమస్య నాలుగు నెలల్లో కాంగ్రెస్ పాలనలో ఎట్లా వచ్చిందో ఒక్కసారి ఆలోచన చేయాలన్నారు. పొరపాటున బీజేపీకి ఓటేస్తే పెనం మీదకెళ్లి పొయిల పడ్డట్లయితదన్నారు. ప్రతి మహిళా ఖాతాలో రూ.2500 నెలనెలా జమ చేస్తామని ఎన్నికల్లో హామీలిచ్చి మోసం చేసిన కాంగ్రెస్‌కు మహిళలను ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. కరోనా సమయంలో సైతం రైతుబంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలను అమలు చేసిన ఘనత కేసీఆర్ సొంతమన్నారు. కేసీఆర్‌ను పట్టుకొని పేగులు మెడలో వేసుకుంటా, అంగీ, లాగు ఊడపీకుతానని రేవంత్ మాట్లాడడం విడ్డూరంగా ఉన్నదన్నారు. చావు నోట్లో తలపెట్టి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌ను పట్టుకొని అలా మాట్లాడొచ్చా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రూ. 500 బోనస్ ఇచ్చి వడ్లు కొంటామన్న కాంగెసోళ్లు కొనుగోలు కేంద్రాలను కూడా ఏర్పాటు చేయలేకపోయారని హరీశ్‌రావు మండిపడ్డారు. ఇంతలా మోసం చేస్తున్న కాంగ్రెస్‌కు మళ్లీ ఓటు వేస్తే ఏం జరుగుతుందో ప్రజలు ఒక్కసారి ఆలోచన చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జహంగీర్, డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, బీఆర్ఎస్ యూత్ వింగ్ ఉపాధ్యక్షుడు జుబేర్ పాషా, ఎంపీపీ లావణ్యాఅంజన్ గౌడ్, జడ్పీటీసీ జయమ్మఅర్జున్‌గౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరేశ్ గౌడ్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు జగదీశ్వర్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు లింగారెడ్డి, సర్పంచుల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు గణేశ్‌గుప్తా, నాయకులు బాల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, హరిబాబు, ప్రవీణ్, ములుగు, వర్గల్ మండలాల బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఆశీర్వదించండి.. అండగా ఉంటా: వెంకట్రామిరెడ్డి

ఆశీర్వదించండి.. అండగా ఉంటానని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. ట్రస్టు ద్వారా ప్రతి నియోజకవర్గంలో కోచింగ్ సెంటర్లు పెట్టి విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందిస్తానన్నారు. ఎంపీగా గెలిచిన ఆరు నెలల్లోగా కేసీఆర్, హరీశ్‌రావు సమక్షంలో ట్రస్టు ఏర్పాటు చేసి ఉచిత సేవలను అందుబాటులోకి తెస్తానన్నారు. ప్రజలు ఆశీర్వదిస్తే మన ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ప్రతి ఆరు నెలలకోసారి జాబ్ మేళా నిర్వహించి యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తానన్నారు. ఒక్క రూపాయికే కల్యాణమండపాలను అద్దెకిచ్చేలా నిర్మిస్తామని చెప్పారు. కారుగుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

# రివర్స్ గేర్‌లో కాంగ్రెస్ పాలన

## పదేండ్లు అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రానికి చేసిందేమీ లేదు..

- బీఆర్ఎస్ ప్రభుత్వం మండుటెండల్లో నీళ్లిస్తే.. కాంగ్రెస్ కన్నీళ్లు పెట్టిస్తున్నది
- మహిళలను ఓట్లు అడిగే హక్కు కాంగ్రెస్‌కు లేదు..
- సీఎం రేవంత్ పని కేసీఆర్‌ను తిట్టుడు.. దేవుడిపై ఒట్టు పెట్టుడు..
- మనసున్న నాయకుడు బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి
- మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం
- కొండపాక, కుకునూరుపల్లి రోడ్ షోలో హరీశ్‌రావు



కుకునూరుపల్లి రోడ్‌షోలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, పక్కన మాజీ మంత్రి హరీశ్‌రావు, వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఇతర నాయకులు

కొండపాక(కుకునూరుపల్లి), మే 6: ఐదు నెలల కాంగ్రెస్ పాలన రివర్స్‌గేర్‌లో నడుస్తున్నదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సోమవారం కొండపాక, కునూరుపల్లి మండలాల్లో నిర్వహించిన రోడ్డు షోలో మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుకునూరుపల్లిలో హరీశ్‌రావుకు బీఆర్ఎస్ శ్రేణులు క్రేన్ సాయంతో భారీ గజమాల వేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు నెలకు రూ.2500, పెండ్లికి తులం బంగారం ఇస్తానని మోసం చేశారని ఆరోపించారు. కౌలు రైతుకు రూ.15వేలు ఇస్తానన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. వడ్లకు రూ.500 బోనస్ ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. కరోనా కష్టకాలంలో కూడా కేసీఆర్ రైతుల ఖాతాలో రైతుబంధు జమచేసిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. కాంగ్రెస్ బోగస్ మాటలు నమ్మి ఓట్లు వేస్తే ప్రజలు మరోసారి తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు. కేసీఆర్ తెలంగాణ తీసుకురాకపోతే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేవాడా, సీఎంస్థాయిలో ఉన్న రేవంత్‌రెడ్డి భాష ఎలా ఉందో ప్రజలు గమనిస్తున్నారని, మన అభిమాన నాయకుడిని తిట్టిన వ్యక్తులకు ఓట్లతో సమాధానం ఇవ్వాలన్నారు. కొంతమంది బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు పదవులు అనుభవించి, గిప్పుడు కాంగ్రెస్‌లోకి ఏం ఉద్ధరిస్తామని పోయారని, పార్టీలు మారిన దొంగలను గల్మలకు కూడా రానివ్వమని హెచ్చరించారు. బీజేపీకి ఓటేస్తే మన బతుకులు నీళ్లు లేని బాయిల అయిపోతయన్నారు. మెదక్ ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ఆశీర్వాదంతో ఎంపీగా పోటీ చేస్తున్నానన్నారు. కుటుంబ సభ్యుల మీద ఒట్టేసి చెబుతున్నా ప్రతి పేదింటికి పెద్దన్నలా నిలబడతానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ, టీఎస్ ఎంఐడీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, అనంతుల ప్రశాంత్, సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జడ్పీటీసీ అనంతుల అశ్వినీప్రశాంత్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్, మాజీ ఎంపీపీ ర్యాగల సుగుణాదుర్గయ్య, వైస్ ఎంపీపీ దేవి రవీందర్, ఎన్ఆర్‌జీఎస్ స్టేట్ కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణారవీందర్, నాయకులు మల్లం ఐలయ్య, పెద్దంకుల శ్రీనివాస్, అమరేందర్, జైపాల్‌రెడ్డి, ఆకుల భద్రప్ప, బొద్దుల కనకయ్య, రాధాకిషన్‌రెడ్డి, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



కొండపాక రోడ్‌షోకు హాజరైన ప్రజలు

# కేసీఆర్ రోడ్ షోను సక్సెస్ చేయాలి

## రేపు పటాన్‌చెరులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్‌షో

- మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు

పటాన్‌చెరు, మే 6: కేసీఆర్ రోడ్ షోను విజయవంతం చేయాలని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పార్టీ శ్రేణులను కోరారు. సోమవారం పటాన్‌చెరులోని జీఎమ్మార్ కన్వెన్షన్ హాల్‌లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ముఖ్యులతో ఏర్పాటు చేసిన సమావేశానికి హరీశ్‌రావు హాజరై పలు సూచనలు చేశారు. బుధవారం పటాన్‌చెరు పట్టణంలో కేసీఆర్ రోడ్‌షోను ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మార్గదర్శనంలో విజయవంతం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలన్నారు. ప్రతిరోజూ ఇంటింటికెళ్లి ప్రచారం చేయాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, డివిజన్లు, మున్సిపాలిటీల నుంచి ప్రజలను రోడ్ షోకు హాజరయ్యేలా చూడాలన్నారు. బీఆర్ఎస్‌కు పెద్దస్థాయిలో ఆదరణ ఉన్నన్నారు. పార్టీకి కంచుకోట పటాన్‌చెరు అని గుర్తు చేశారు. కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేలా కేసీఆర్ రోడ్ షో ఉంటుందన్నారు. ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీలు గడీల శ్రీకాంత్‌గౌడ్, కొలన్ బాల్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ ఈర్ల దేవానంద్, జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, శ్రీధర్‌చారి తదితరులు పాల్గొన్నారు.



పటాన్‌చెరులో బీఆర్ఎస్ శ్రేణులతో మాట్లాడుతున్న మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు, బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

# జిల్లాలను రద్దుచేస్తే ఊరుకోం

- బీజేపీ, కాంగ్రెస్ ఫేక్ ప్రచారాలు చేయడం సిగ్గుచేటు
- ఆరు గ్యారెంటీలు అమలైన గ్రామాల్లో మేము ఓట్లు అడగం
- దమ్ముంటే కాంగ్రెస్ ముందుకురావాలి
- నర్సాపూర్ ప్రెస్‌మీట్‌లో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



మెదక్ జిల్లా నర్సాపూర్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో సునీతాలక్ష్మారెడ్డి, వెంకట్రామిరెడ్డి, చంద్రాగౌడ్ తదితరులు

నర్సాపూర్, మే 6: సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలను రద్దుచేస్తే ఊరుకోమని కాంగ్రెస్ ప్రభుత్వానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు హెచ్చరించారు. సోమవారం మెదక్ జిల్లా నర్సాపూర్‌లో స్థానిక ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో కలిసి మీడియాతో ఆయన మాట్లాడారు. పరిపాలనా సౌలభ్యం కోసం కొత్త జిల్లాలను కేసీఆర్ ఏర్పాటు చేస్తే, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాలను రద్దు చేస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జిల్లాల రద్దును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీలు బీఆర్ఎస్‌పై అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు బీఆర్ఎస్ అభ్యర్థిపై సోషల్ మీడియాలో గ్లోబెల్స్ ప్రచారం చేస్తున్నాడని మండిపడ్డారు. బీఆర్ఎస్ అభ్యర్థిపై తప్పుడు వీడియోలు సృష్టించిన బీజేపీ యువ మోర్చా నాయకులపై పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఇప్పటికే కేసు నమోదు అయ్యిందన్నారు. హామీలు చేతగాక సెంటిమెంట్ రగిల్చి ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నాయని కాంగ్రెస్, బీజేపీలను ఆయన విమర్శించారు. ఓవైపు ఎండలు మండుతుంటే, మరోవైపు కాంగ్రెస్, బీజేపీ మోసపూరిత మాటలతో ప్రజల గుండెలు మండుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం రెండు వేవ్‌లు నడుస్తున్నాయని, ఒకటి హీట్ వేవ్ కాగా.. మరోటి బీఆర్ఎస్ వేవ్ అని హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ విజయం ఖాయమైపోయిందన్నారు. మెదక్ జిల్లా కీర్తిని ఆకాశానికి ఎత్తి చాటిన కేసీఆర్‌ను తిట్టడం సరికాదన్నారు. మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మన్సూర్, మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు గోపి, సత్యంగౌడ్, వెంకట్‌రెడ్డి, శివకుమార్, భిక్షపతి పాల్గొన్నారు.

# ఎన్నికల నియమావళిని మీడియా పాటించాలి



మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి

మెదక్, మే 6 (నమస్తే తెలంగాణ) : జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ ఆదేశాల మేరకు సోమవారం మెదక్ సమీకృత కలెక్టరేట్‌లో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ఎన్నికల సంఘం నియమావళికి లోబడి ఎంసీసీ, ఎంసీఎంసీ (మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ), సోషల్ మీడియా తదితర అంశాలపై అవగాహన, శిక్షణ శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఎన్నికలపై ఎంసీసీ, ఎంసీఎంసీ, పెయిడ్ న్యూస్, సోషల్ మీడియా అంశాలపై మాస్టర్ ట్రైనర్ ఆర్డీవో జయచంద్రారెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేశారన్నారు. ఈ కమిటీ చెల్లింపు వార్తలను గుర్తించడం, ప్రచురణ, అనుమతి లేకుండా ప్రకటనలు ప్రసారం చేయడం, అభ్యర్థి ప్రచార వ్యయంలో వాటిని లెక్కిస్తారన్నారు. సోషల్ మీడియాలో అభ్యర్థులు ప్రకటనలకు ప్రి సర్టిఫికేషన్ అయిన తర్వాతే ప్రసారం చేయాలని, కేబుల్ చానెళ్లలో, సోషల్ మీడియాలో ప్రసారమయ్యే వార్తలు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో 24x7 ఎంసీఎంసీ పర్యవేక్షిస్తుందని చెప్పారు. సోషల్ మీడియాగా పిలువబడే ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ ద్వారా ప్రసారమయ్యే వార్తలను సోషల్ మీడియా పర్యవేక్షణ బృందం నిత్యం పరిశీలిస్తూ, ఎంసీసీ నిబంధనలు అతిక్రమిస్తే సంబంధిత వ్యక్తులు, మీడియాపై కఠిన చర్యలు తీసుకుంటారని చెప్పారు. పోలింగ్‌కు ఒకరోజు ముందు, పోలింగ్ రోజు ఏదేని ప్రకటన ఇవ్వాల్సి ఉంటే కచ్చితంగా మీడియా సర్టిఫికేషన్ పొంది ప్రచురించాలన్నారు. అనంతరం మీడియా ప్రతినిధుల సందేహాలను మాస్టర్ ట్రైనర్ నివృత్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా మీడియా నోడల్ అధికారి రామచంద్ర రాజు, ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

